క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



వాటర్‌పైపును పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ బుచ్చానాయక్

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని నడిమితండా ప్రాథమిక పాఠశాలను ఇన్‌చార్జీ ఎంఈఓ బుచ్చానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మన ఊరు – మన బడి పథకం పనులు వెంటనే చేపట్టాలన్నారు. విద్యార్థులకు తాగు నీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంజిత్‌నాయక్, కాంప్లెక్స్ హెచ్ఎం జనార్దన్, సీఆర్పీ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి గ్రామ శివారులలో ఉన్న మోడల్ స్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును పొడిగించిందని పాఠశాల ప్రిన్సిపాల్ అముతుల్ జమాల్ అస్రా పేర్కొన్నారు. ఇంతకు ముందు దరఖాస్తు చేసుకోనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు సీఎం కేసీఆర్ అండగా ఉంటారని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోమారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త శివరాములు మృతి చెందాడు. దీంతో పార్టీ పరంగా మంజూరైన రెండు లక్షల బీమా చెక్కును గురువారం మృతుడు భార్య యాదమ్మకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): రెండు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో గురువారం మండలంలోని కాళ్లకల్ గ్రామంలో పంచాయతీ కార్మికులు భిక్షాటన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక అధ్యక్షుడు వీరేశ్, పూర్ణస్వామి, సుశీల, నర్సమ్మ, ఆగమయ్య, అంజయ్య, కృష్ణ, రాజు తదితరులున్నారు.

రాగి ఆకుపై సీఎం చిత్రం



మనోహరాబాద్(తూప్రాన్): సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా మనోహరాబాద్ ఉన్నత పాఠశాల ఆర్ట్ టీచర్ బ్రహ్మాచారి సీఎం సీఎం చిత్రపటాన్ని రాగి ఆకుపై ఆర్ట్ వేశాడు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం

కొల్చారం(నర్సాపూర్): కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మంజుల, రంగంపేట గ్రామ సర్పంచ్ సుజాత పేర్కొన్నారు. గురువారం మండలంలోని రంగంపేటలో గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హర్షిత, సీహెచ్‌ఓ సుదర్శన్, పంచాయతీ వార్డు మెంబర్లు సురేష్, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దుర్గేష్, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లిలో కొనసాగుతున్న కంటి వెలుగు వైద్యశిబిరాన్ని గురువారం జిల్లా పరిశ్రమలశాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి శ్రీకాంత్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. కార్యక్రమంలో కంటి వెలుగు డాక్టర్ రమేశ్‌బాబు, ఏఎన్ఎంలు మజీదాబేగం, ఆశవర్కర్లు నీరజ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

● 18 నుంచి సోమేశ్వరాలయ ఉత్సవాలు
● ఏర్పాట్లు చేస్తున్న పాలకవర్గం



శివలింగం



చిన్నశంకరంపేటలోని సోమేశ్వరాలయం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని సోమేశ్వరాలయ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా మహాశివరాత్రి నుంచి నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. చాణిక్యుల నుంచి నేటికీ ఆలయం భక్తులకు ఆధ్యాత్మికతను పంచుతుంది. చూసేందుకు మట్టిదిబ్బగా కనిపించినా అందులో సుందరమైన శిల్ప సంపద దాగి ఉంది. ఆలయంలో రాతి స్తంభాలు గణపతి దేవుడు, నాగదేవతలతో పాటు భైరవుడు, నదీశ్వర విగ్రహాలు కాకతీయుల కాలానికి అద్దం పట్టే విధంగా ఉన్నాయి. కాకతీయుల కాలంలో రాజ్య విస్తరణ జరిగిన ప్రాంతాల్లో ఆలయాలు, చెరువులు తవ్విన చరిత్ర ఉంది. అందులో భాగంగానే సోమేశ్వరాలయంలో వారి కళను జోడించి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దినట్టు సమాచారం.

పూజా కార్యక్రమాలు

మహాశివరాత్రి సందర్భంగా 18న (శనివారం) సుప్రభాతసేవ, గణపతి పూజ, పుణ్యావాచనం,



నందీశ్వరుడు

అఖండ దీపారాధన, మల్లికార్జున, సోమేశ్వర స్వామి పల్లకీ సేవ నిర్వహిస్తారు. 19న మహా న్యాస పూర్వక రుద్రాభిషేకం మంత్రపుష్పం, సాయంత్రం ప్రత్యేక పూజలతో పాటు బండ్ల ఊరేగింపు, వెంకటేశ్వర స్వామి తులసిదళం పూజ నిర్వహణ. 20న పోచమ్మతల్లకి బోనాలు, భద్రకాళీ, వీరభద్రస్వామి వస్త్రాయణం, అగ్ని గుండాల నిర్వహణ. 21న హోమం, లక్ష పుష్పార్చనతో పాటు చండిక సోమేశ్వరస్వామి కల్యాణం. సాయంత్రం రావణ దహనం, రథోత్సవం ఊరేగింపు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



సోమేశ్వరాలయ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయం బయటపడిన ప్పటి నుంచి ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. గ్రామస్తులు, ధర్మదాతల సహకారంతో భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– రాజిరెడ్డి, సర్పంచ్, చిన్నశంకరంపేట

సిద్ధమవుతున్న శైవ క్షేత్రాలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉత్సవాలకు ముస్తాబైన శ్రీ రామలింగేశ్వర ఆలయం



పెద్దశంకరంపేట(మెదక్): గురుపాదగుట్ట శివాలయం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మహాశివరాత్రి ఉత్సవాలను మండలంలోని చండూర్ గ్రామ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. మండలంలోనే ప్రసిద్ధిగాంచిన 900 ఏళ్ల చరిత్ర గల శైవక్షేత్రం. మహిమ గల స్వామిగా భక్తుల్లో ఎంతో నమ్మకం ఉంది. దేవాలయ పాలక మండలి ప్రథమ అధ్యక్షుడిగా సుచిత్ర వెంకట్‌రెడ్డి ఉన్నారు. ప్రస్తుతం గ్రామ పెద్దలే ఆలయ కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు.

➡ మహాశివరాత్రి పర్వదినం రోజున జరుగనున్న ప్రత్యేక పూజలను దృష్టిలో పెట్టుకొని ఆలయంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు.

➡ రూ. 11 లక్షలతో బారీ రథం

➡ గ్రామంలో రామలింగేశ్వర ఆలయానికి గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు సమిష్టిగా చందాలు వేసుకొని రెండేళ్ల క్రితం రూ. 11 లక్షలతో భారీ రథాన్ని తయారు చేయించారు.

➡ వేడుకల్లో రథోత్సవం ఘనంగా సాగుతోంది. గుట్టపై ఆలయంతో పాటు గ్రామం చూట్టూ రథోత్సవం నిర్వహిస్తారు.

➡ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 18న శివ కల్యాణం, స్వామివారికి అభిషేకాలు, రుద్రాభిషేకం, సత్యనారాయణ స్వామి వ్రతాలు, అమ్మవారికి ఒడిబియ్యం, శివస్వాముల దీక్ష విరమణ, ఉపవాస దీక్షలు.

➡ 19న అభిషేకం, బండ్ల ఊరేగింపు, అన్నదానం, రాత్రి వేళలో సాంస్కృతిక కార్యక్రమం.

➡ 20న పాచిబండ్ల ఊరేగింపు, 21న రథోత్సవం, లంకదహనం కార్యక్రమాలు జరుగనున్నాయి.

పెద్దశంకరంపేట(మెదక్): మహాశివరాత్రి సందర్భంగా ఉత్సవాలకు గురుపాదగుట్ట శివాలయం ముస్తాబవుతోంది. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, మంగళవారం 21న పుణ్యాహవచనం, శ్రీభ్రమరాంభ సమేత, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, ఆకుపూజ, అన్నపూజ, రుద్రయాగం, 22 బుధవారం శ్రీ పార్వతీ పరమేశ్వరుల కళ్యాణమహోత్సవం, అభిషేకాలు, సాయంత్రం ఎడ్ల బండ్ల ఊరేగింపు, సాయంత్రం దీపారాధన, అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బలరాం సంగమేశ్వర్, అర్చకుడు దత్తులు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు తీసుకోవాలని వారు కోరారు.

కాలేజీలో ఆధునిక సదుపాయాలు



కేక్ కట్ చేస్తున్న సొసైటీ చైర్మన్, కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నర్సాపూర్: శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో కొనసాగుతున్న వైపర్ కాలేజీలో ఆధునిక సదుపాయాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ విష్ణురాజు సూచించారు. నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ నుంచి కాలేజీకి ఏ ప్లస్ గ్రేడ్ రావడంతో గురువారం ఏర్పాటు చేసిన అభినందన సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడుతూ... కాలేజీకి ఏ ప్లస్ గ్రేడ్ రావడంపై ప్రిన్సిపాల్, అధ్యాపక బృందాన్ని అభినందించారు. తెలంగాణలోని విద్యా సంస్థల్లో ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన మొదటి కాలేజీగా వైపర్ నిలుస్తుందని చెప్పారు. ఫార్మసీ రంగంలో కొత్త ఆలోచనలకు రూపం ఇవ్వడానికి కాలేజీ యాజమాన్యం అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన



టేక్మాల్(మెదక్): రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

టేక్మాల్(మెదక్): మండలంలోని కుసంగి, దనూర, ఎలకుర్తి, ఎల్లుపేట్, టేక్మాల్ ఉన్నత పాఠశాలల్లో గురువారం పదో తరగతి మానిటరింగ్ బృందం సభ్యులు ఇంటర్నల్ మార్కులు, సీసీఈ రికార్డులను ఫార్మేటివ్ బుక్స్‌ను పరిశీలించారు. ఇందులో మానిటరింగ్ బృందం సభ్యులు హెచ్ఎం వసంత, సభ్యులు శివ శంకర్ (ఫిజిక్స్), సమీర్(హిందీ పండిట్) పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శివకుమార్, గోవర్ధన్, సంజీవయ్య, మల్లేశం తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని పలు పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వెరిఫికేషన్ అధికారి బాలచంద్రం మాట్లాడుతూ.. మోడల్ పాఠశాలతో పాటు దీప్తి విద్యాలయంలో పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులకు సంబంధించిన రికార్డులు పరిశీలించామన్నారు. ఈ పరిశీలనలో అశోక్, లక్ష్మణ్, సూర్యప్రకాశ్, సుభాష్, పవన్ తదితరులు సాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు


◆ **గ్రంథాలయం పరిశీలన**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని గ్రంథాలయాన్ని గురువారం ఎంపీపీ మాసుల శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని వసతులను గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు సరైన వెలుతురు లేదని స్టోర్ రూంలో వర్షానికి నీరు వస్తుందని లైబ్రేరియన్ అర్చన ఎంపీపీకి వివరించారు. శాఖా గ్రంథాలయం అయినా.. మరుగుదొడ్డి లేకపోవడం గమనించి ఎంపీపీ మండల పరిషత్ నిధులుతో మరుగుదొడ్డి నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు.

◆ **ఆటో స్టార్టర్లను తొలగించాలి**

రామాయంపేట(మెదక్): ఆటో స్టార్టర్లతో విద్యుత్‌తో పాటు నీరు వృథాగా మారి, ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని నార్సింగి ట్రాన్స్‌కో ఏఈ స్వామి సూచించారు. ఆయన గురువారం నార్సింగి మండల కేంద్రంలో మాట్లాడుతూ.. అవసరమున్నంతమేర మాత్రమే విద్యుత్ వినియోగించుకోవాలన్నారు. ఆటో స్టార్టర్లను తొలగిస్తేనే ఇది సాధ్యమవుతుందని, ప్రభుత్వం యూనిట్‌కు రూ. 12కు కొనుగోలు చేస్తూ రైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తుందని పేర్కొన్నారు.

◆ **కార్మికులకు దుస్తుల పంపిణీ**



చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని బద్యాతండా గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశామని సర్పంచ్ బుజ్జిబాయి అన్నారు. గురువారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పరిసరాలు పంచాయతీ కార్మికుల కృషితోనే పరిశుభ్రంగా ఉంటాయన్నారు. గ్రామాలకు కార్మికులు చేసే సేవలు హర్షనీయమన్నారు. గ్రామ ప్రజలు కార్మికులకు సహకరిస్తూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు.

◆ **ఏడుపాయలకు ప్రత్యేక బస్సులు**

నర్సాపూర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నర్సాపూర్ నుంచి ఏడుపాయల వరకు ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ రవిచందర్ తెలిపారు. నర్సాపూర్ నుంచి ఏడుపాయల శ్రీకనకదుర్గా భవానీ ఆలయం వరకు 17 బస్సులను ఈనెల 17 నుంచి 21 వరకు నడిపిస్తామని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లోని బాలనగర్ నుంచి నర్సాపూర్, పోతంశెట్టిపల్లి మీదుగా ఏడుపాయల ఆలయం వరకు నడుస్తాయని ఆయన చెప్పారు.

◆ **సీసీరోడ్డు పనులు ప్రారంభం**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.10 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ నాగలక్ష్మి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉపేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

◆ **కనుల పండువగా శివ కల్యాణం**

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేటలోని ఈశ్వరాలయంలో పురోహితుడు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో గురువారం శివపార్వతుల కల్యాణం కనుల పండుగగా జరిగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు.

◆ **దేవాలయ నిర్మాణానికి భూమిపూజ**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి పంతులు వేణుగోపాల్ శర్మ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశ్, నాయకులు రవి, ఎంపీటీసీ లావణ్య, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ **వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా**

మనోహరాబాద్(తూప్రాన్): వ్యవసాయానికి నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయనున్నట్లు గురువారం ఏఈ కృష్ణ తెలిపారు. రైతులు నీటి వనరులను వృథా చేయొద్దని కోరారు.

◆ **మినీట్యాంక్‌కు మరమ్మతులు**



నర్సాపూర్: వార్డు ప్రజల అవసరాలను గుర్తించి మినీ ట్యాంకు వద్ద మరమ్మతులు చేపట్టామని గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. పట్టణంలోని ఐదవ వార్డులో మినీట్యాంకు నిరుపయోగంగా ఉండేదన్నారు. బోరు నుంచి మినీ ట్యాంకుకు ఉన్న పైపులైన్‌కు మరమ్మతులు చేసి, ట్యాంకుకు బిగించిన నల్లాల నుంచి నీరు వచ్చేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న అచ్చంపేట గ్రామస్తులు

నర్సాపూర్ రూరల్: అక్రమంగా చెరువులు, కుంటల నుంచి ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని అచ్చంపేట గ్రామస్తులు ఆర్డీఓ, తహసీల్దార్‌లకు గురువారం ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి చెందిన కొంతమంది చెరువులు, కుంటల నుంచి పెద్ద ఎత్తున రాత్రి, పగలు తేడా లేకుండా పెద్ద ఎత్తున ట్రాక్టర్లు ద్వారా ఫిల్టర్ చేసి ఇసుకను తరలిస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. దీంతో చెరువులు, కుంటల్లో గోతులు ఏర్పడి, నీరు అడుగంటి పోతున్నట్లు వాపోయారు. రెవెన్యూ అధికారులు స్పందించి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పి.నర్సయ్య, సాయిలు, ఆంజనేయులు, రమేశ్, కిష్టయ్య, పోచయ్య, గోవర్ధన్, జయరాజు, మరో 30 మంది ఉన్నారు.


శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



రాంపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న సీఐ, సిబ్బంది

అల్లాదుర్గం(మెదక్): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసమే గ్రామాల్లో కమ్యూనిటి కనెక్టవిటి పోగ్రామ్ చేపడుతున్నట్లు సీఐ జార్జ్ చెప్పారు. గురువారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ గ్రామంలో జిల్లా ఎస్పీ రోహిణీ ప్రియదర్శిణి ఆదేశాల మేరకు కమ్యూనిటి కనెక్టవిటి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అల్లాదుర్గం సర్కిల్ సీఐతో పాటు పరిధిలోని నలుగురు ఎస్ఐలు, ఏఎస్ఐ 3, హెడ్‌కానిస్టేబుల్ 3, మహిళ కానిస్టేబుల్ 7, హోంగార్డులు 9 మంది, 13 కానిస్టేబుల్స్‌తో కలిపి 40 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతీ ఇంటిని, వాహనాలను క్షుణంగా పరిశీలిస్తామని చెప్పారు. రాంపూర్ గ్రామంలో 27 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్‌కు పత్రాలు లేక పోవడంతో సీజ్ చేసినట్లు చెప్పారు. రాంపూర్ గ్రామస్తులు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ.లక్ష 50 వేల విరాళం అందజేశామని తెలిపారు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, రేగోడ్ ఎస్ఐ సత్యనారాయణ, టేక్మాల్ ఎస్ఐ లింగం, పెద్ద శంకరంపేట ఎస్ఐ బాల్‌రాజ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఐలు, తదితరులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని మంజీరా విద్యాలయంలో గురువారం విద్యార్థులకు షీటీం ప్రతినిధులు, పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫోన్లలో వస్తున్న అనవసర లింకులపై క్లిక్ చేయొద్దన్నారు. అమ్మాయిలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వెంటనే తమకు లేదా 100కు ఫోన్ చేయాలని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా షీంటీంనకు సంబంధించి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ – 2 రాంచందర్, ఏహెచ్‌టీయూ ఎస్ఐ మల్లయ్య, షీటీం ప్రతినిధులు కిరణ్, మంజీరా విద్యాలయం కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నివారణ చర్యలతో పంటలు భద్రం

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే వరి పంటను కాపాడుకోవచ్చని మండల వ్యసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని సోమక్కపేట, గంగారం గ్రామాల్లో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. యాసంగి వరిలో కాండం తొలుచు పురుగు, అగ్గితెగులు ఉధృతి తీవ్రంగా ఉందన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు వరిలో ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజల్ 0.6 గ్రాముతో పాటు మాంకోజెబ్ 0.25 గ్రాము, లేదా కాసుగామైసిన్ 2.5 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భూపాల్, రైతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): చేగుంట మండలం సంకాపూర్, సిక్కుతండాలో తెగుళ్ల బారిన పడ్డ వరి పంటను గురువారం నార్సింగి మండల వ్యవసాయ అధికారి యాదగిరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెగులు నివారణకు గాను రైతులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను వివరించారు. పంట చేలకు ఆకుముడత పురుగు ఆశించిందని, దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ నాలుగు వందల గ్రాముల పొడిని రెండు వందల లీటర్ల నీటిలో కలిపి ఎకరం పంట చేలతో పిచికారీ చేయాలని సూచించారు. అక్కడక్కడ మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకిందని, దీని నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాముల పొడిమందును నీటిలో కలిపి పంటకు పిచికారీ చేయాలని చెప్పారు. పంటలకు తెగులు సోకితే రైతులు తమ దృష్టికి తీసుకువచ్చి మందులు వాడాలన్నారు.

'డబుల్ బెడ్రూం ఇళ్ల ఊసే లేదు'



మాట్లాడుతున్న నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్



కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలను సన్మానిస్తున్న విఠల్



కౌడిపల్లి(నర్సాపూర్): మాట్లాడుతున్న సింగాయపల్లి గోపి

చిలప్‌చెడ్(నర్సాపూర్): డబుల్ బెడ్రూం ఇళ్ల విషయం గురించి టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చినప్పటికీ మండలంలో ఒక్క డబుల్ బెడ్రూం ఇళ్లు కూడా నిర్మించలేదని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని చిట్కుల్ గ్రామంలో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మురళీయాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు మోదీ ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దశరథ్, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్‌గౌడ్, సంతోష్, అజ్జమర్రి మాజీ సర్పంచ్ నాగేష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ వెంకటేశం, శక్తి కేంద్ర సహ ఇన్‌చార్జ్ హరీశ్‌కుమార్, నాయకులు ఆంజనేయులు, ప్రశాంత్, బాలు, మహేశ్, అశోక్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నారాయణఖేడ్ నియోజకవర్గ కేంద్రంలో గురువారం జరిగిన బీజేపీ కార్యవర్గ సమావేశానికి కేంద్ర పశువర్ధక, మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం కేంద్రమంత్రిని పేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్‌తో పాటు పలువురు మండల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మంగళి కృష్ణ, ఓబీసీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, సుధాకర్, కుమార్, విశ్వనాథం, సాయిలు తదితరులున్నారు.

అర్హులందరికీ పక్క ఇళ్లు నిర్మిస్తాం

కౌడిపల్లి(నర్సాపూర్): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోని రాగానే అర్హులందరికీ పక్క ఇళ్లు నిర్మిస్తామని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు సంగాయపల్లి గోపి తెలిపారు. గురువారం కౌడిపల్లిలో ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, అసెంబ్లీ ఇన్‌చార్జి వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, నర్సాపూర్ కౌన్సిలర్ రాజేందర్, మండల అధ్యక్షుడు రాకేశ్, నాయకులు అశోక్, శేఖర్, చెల్లకుమార్, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించడం సరికాదు

టేక్మాల్ మండల సర్వసభ్య సమావేశంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ యూసూఫ్



మాట్లాడుతున్న ఎంపీపీ స్వప్న

టేక్మాల్(మెదక్): విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని జిల్లా కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ యూసూఫ్ మండిపడ్డారు. గురువారం మండల కేంద్రం టేక్మాల్‌లో ఎంపీడీఓ భారతి ఆధ్వర్యంలో ఎంపీపీ స్వప్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతీ సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని సూచించారు. కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీ వాణి మాట్లాడుతూ.. పలుమార్లు విద్యుత్ సమస్యలను గుర్తించి వివరించినా.. పట్టించుకోవడం లేదన్నారు. వెల్పుగొండ పంచాయతీ పరిధిలోని బొల్లికుంటతండాలో అంగన్‌వాడీ కేంద్రానికి రెగ్యులర్ టీచర్‌ను ఏర్పాటు చేయాలని సర్పంచ్ నారాయణ కోరారు. పెండింగ్ బిల్లులు త్వరగా వచ్చేలా చూడాలని ఎల్లుపేట సర్పంచ్ సాయిలు తెలిపారు. అధికారులు సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు వెంటనే తీర్చాలని ప్రజాప్రతినిధులు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సరోజ, వైస్ ఎంపీపీ మంజుల, ఏఓ రాం ప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ శాలిని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, ప్రజాప్రతినిధులు సుప్రజా, శ్వేత, నిమ్మవాణి, రాంబాయి, లచ్చాగౌడ్, గౌతంరాజ్, సంగయ్య, మోహన్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.